## సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ఎదులాపురం, ఏప్రిల్ 4: ఆదిలాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం స్థానిక జూబ్లీహిల్స్ కాలనీ వాసులు ధర్నా చేపట్టారు. కాలనీలో చేపడుతున్న సెల్‌టవర్ నిర్మాణం వెంటనే అధికారులు అపేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ ఏరియాల్లో సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దన్న నిబంధనలున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టవర్ యజమానులు, అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## లాటరీ పద్ధతి ద్వారా వీధి వ్యాపారులకు స్థలం కేటాయింపు

ఎదులాపురం, ఏప్రిల్ 4 : ఆదిలాబాద్‌లోని వీధి వ్యాపారులకు స్థానిక గణేశ్ థియేటర్ ప్రాంతంలో తాత్కాలికంగా స్థలాల కేటాయింపు కోసం శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్‌లో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా లక్కీ లాటరీ తీసి వీధి వ్యాపారులకు స్థలాలు కేటాయించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కమిషనర్‌కు సన్మానం



కరీంనగర్ కమిషనర్‌ను సన్మానిస్తున్న సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఎదులాపురం, ఏప్రిల్ 4 : ఇటీవల అదిలాబాద్ ఎస్పీగా పని చేసి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన గౌష్ ఆలంను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు కరీంనగర్‌లోని పోలీస్ కమిషనర్ ఆఫీస్‌లో పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రిని కమిషనర్ గౌష్ ఆలం ఆదిలాబాద్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ప్రధాన కార్యదర్శి మాధవ్, కోశాధికారి పడకంటి సూర్యకాంత్, కార్య నిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్ ఉన్నారు.

## 6న ఆదివాసీ విద్యార్థుల జిల్లా సదస్సు

ఉట్నూర్, ఏప్రిల్ 4: ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా సదస్సు ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్‌లో ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగ్‌దేవ్ తెలిపారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలోని భీం విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. జిల్లా సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ వస్తున్నారని తెలిపారు. ఇందులో ఆశ్రమాలలో విద్యార్థుల మరణాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, ఆశ్రమ పాఠశాలల సౌకర్యాలు, ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు, ఆదివాసుల అభివృద్ధి, తదితర అంశాలపై సదస్సు ఉంటుందన్నారు. విద్యార్థులు, యువతీ యువకులు, ప్రజాప్రతినిధులు, రాయిసెంటర్ సార్‌మేడీలు, పటేల్, దేవరిలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


## పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అందించాలి

నేరడిగొండ, ఏప్రిల్ 4 : ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం అందించాలని ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని ఎంపీపీఎస్ తేజాపూర్‌లో 5 వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పవన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఏఎస్ఐ

నేరడిగొండ, ఏప్రిల్ 4 : అది జాతీయ రహదారి.. వందలాది వాహనాలు నడుస్తున్నాయి.. మధ్యాహ్నం లఖంపూర్ గ్రామం వద్ద ఓ వృద్ధురాలు కాలినడకన రోడ్డుదాటేందుకు ప్రయత్నిస్తూ అవస్థలు పడుతుంది. అటుగా వెళ్తున్న ఏఎస్ఐ బలిరాం గమనించాడు. ఆ వృద్ధురాలిని వెంటనే కాలినడకన ఆవతలి వైపునకు సురక్షితంగా తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. మానవత్వంతో పాటు విధి నిర్వాహణలో భాగంగా తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించానని ఏఎస్ఐ తెలిపారు.

## జొన్నల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్

బోథ్, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు చేయాలని ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ అన్నారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సూరజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు భీమ బుచ్చన్న, ఎస్టీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు మడావి మారుతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మడావి భీంరావ్, మహేందర్ పాల్గొన్నారు.

## చింతల్‌బోరిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

బోథ్, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని శుక్రవారం గ్రామస్తులు తహసీల్దార్ మల్లేశ్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో ఇక్కడ నెట్‌వర్క్ లేకపోవడంతో రేషన్ దుకాణాన్ని సొనాలకు తరలించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ టవర్ ఏర్పాటు చేయడంతో నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చిందని గుర్తు చేశారు. గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేసి సకాలంలో సరుకులు అందుకునేలా వీలు కల్పించాలని విన్నవించారు.

## గర్భిణులు పోషకాహారాలు తీసుకోవాలి

జైనథ్, ఏప్రిల్ 4: గర్భిణులు మంచి బలమైన పోషకాహారాలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శృతి సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని బాలాపూర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ మోహన్, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్, అంగన్‌వాడీ టీచర్ సునంద, గ్రామస్తులు పాల్గొన్నారు.



గాదిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న అధికారుల కుర్చీలు



తాళం వేసి ఉన్న ఎమ్మార్సీ కార్యాలయం

## ప్రభుత్వ కార్యాలయాల్లో సమయ పాలనేది?

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడలోని మండల ప్రజా పరిషత్, తహసీల్, ఐకేపీ, పశువైద్యశాల, విద్యావనరుల కార్యాలయాల్లో అధికారులు సమయపాలన పాటించడం లేదు. అధికారులు, సిబ్బంది శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కూడా రాలేదు. ఈజీఎస్ కార్యాలయంలో అంటెండర్ మాత్రమే ఉన్నాడు. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు అధికారుల రాకకోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండల శాఖ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు. - నార్నూర్, ఏప్రిల్ 4

## కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి జోగు రామన్న
- బేల మండల ఆదివాసీ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరిక



సిడాం నందు కుమార్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

బేల, ఏప్రిల్ 4 : కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులతో పాటు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. మోసపూరిత బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ యువత స్వచ్ఛందంగా బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో బేల మండలంలోని బాది గ్రామానికి చెందిన సిడాం నందుకుమార్ పార్టీలో చేరారు. మాజీమంత్రి జోగు రామన్న ఆయనకు గులాబీ కండువా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఆదివాసులకు అన్ని విధాల ప్రోత్సాహం లభించిందని కొనియాడారు. మళ్లీ కేసీఆర్ పాలన కావాలని కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మనోహర్, ప్రమోద్ కుమార్, గంభీర్, సతీష్ పవార్, తేజ్‌రావ్, మధుకర్, అరుణ్ కొడప, వివేక్, తన్వీర్, పోతారెడ్డి, దయాకర్, భానుచందర్ పాల్గొన్నారు.

## డీఎండబ్ల్యూవోగా మనోహర్



మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సూపరింటెండెంట్, సిబ్బంది

ఎదులాపురం, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎం మనోహర్ రావ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి పని చేసిన బీసీ వెల్ఫేర్ అధికారి కే రాజలింగు నుంచి ఎం మనోహర్‌రావ్ బాధ్యతలు తీసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం మనోహర్‌రావ్‌కు కలెక్టర్ రాజర్షి షా డీఎండబ్ల్యూవోగా (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను సూపరింటెండెంట్ కృష్ణవేణి, సిబ్బంది పుష్పగుచ్ఛం స్వాగతం పలికారు.

## సన్నబియ్యం పంపిణీలో లోటుపాట్లు లేకుండా చూడాలి

నర్సాపూర్(జీ), ఏప్రిల్ 4 : సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి లోటు పాటు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జీ) మండలం గొల్లమాడ గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఆర్డీవో రత్నకళ్యాణితో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అందిస్తున్న సన్నబియ్యం పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. యాబ్ తహసీల్దార్ వహీద్, ఆర్ఐ సుమలత ఉన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

నార్నూర్, ఏప్రిల్ 4 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం ఖడ్కి కోలాంగూడ గ్రామానికి చెందిన మడావి భీంరావ్(19) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గాదిగూడ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం..తండ్రి మందలించడాని భీంరావ్ వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## అపహరించబడిన వ్యక్తిని కాపాడిన నిర్మల్ పోలీసులు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 4 : నిర్మల్‌లో ఓ వ్యక్తి కిడ్నాప్ కాగా మూడు గంటల్లోనే పోలీసులు ఆచూకీ కనుక్కొని కాపాడారు. ఏఎస్పీ రాజేష్‌మీనా వివరాలు వెల్లడించారు. నిర్మల్‌లోని సాగర్‌కాలనీలో నివాసముంటున్న కొంపెల్లి రవీందర్ ఫొటోగ్రాఫర్ వీసా ఇప్పిస్తానని చెప్పి రూ. 40 వేలు తీసుకోగా బుధవారం సాయంత్రం ఆటోలో వెళ్తుండగా నిజామాబాద్‌కు చెందిన నలుగురు వ్యక్తులు కారులో వచ్చి ఆటోకు అడ్డం పెట్టి అతడిని బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేసి పడకల్ తండాకు తీసుకెళ్లారు. కారులో వెళ్తుండగా అతడిని ముఖంపై కొట్టి గాయపరిచారు. గురువారం రవీందర్ తమ్ముడు అతని తల్లి పోలీసులకు తెలపడంతో ఎస్పీ డా. జానకీషర్మిల ఆదేశాలతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఆచూకీ కనుక్కొని కిడ్నాపైన రవీందర్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో నిందితులైన బదావత్ మహేశ్, భూక్యా చిన్న, పిప్పెర శ్రావణ్, జక్కుల ఆంజనేయులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

దిలావర్‌పూర్. ఏప్రిల్ 4: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వతండా గ్రామంలో ఎస్ఐ సందీప్ అధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సరియైన పత్రాలు లేని 88 బైకులు, నాలుగు ఇతర వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఎస్ఐలు, పోలీసులు, నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉట్నూర్‌రూరల్, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం, జైనూర్ మండలం సరిహద్దులోగల పూసిగూడ ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామానికి చెందిన తొడసం జంగు(28) ఉట్నూర్ మండలం దుర్గాపూర్ గ్రామంలో గల తన అత్తారింటికి భార్య, పిల్లలను చూడడానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు సరిగా లేక అదుపుతప్పి పడిపోయాడు. తలకు గాయాలు కావడంలో ప్రభుత్వ దవాఖాన లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

## ఢిల్లీకి బయలుదేరిన ఆదివాసీ కళాకారుల బృందం

ఇచ్చోడ, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ప్రముఖ ఆదివాసీ కళాకారుడు ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ బృందం ఢిల్లీలో నిర్వహించబోయే జయతి జయ మామ భారతం అనే కార్యక్రమనికి శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆదివాసీ కళాకారుడు ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో భాగంగా నెల రోజులు పాటు ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నృత్యం చేసిన కళాకారులను ఎంపిక చేసి మరోసారి వీడియో రికార్డింగ్ డాక్యుమెంటేషన్ కోసం ఢిల్లీకి ప్రత్యేక విమానంలో బయలుదేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం కార్యదర్శి కాత్లే ఆనంద్, కళాకారులు గంగోత్రి, రీతు పాల్గొన్నారు.

## సన్నబియ్యం సరఫరాపై సర్కారుకు శ్రద్ధ ఏది?

లక్ష్మణచాంద, ఏప్రిల్ 4: మండలంలో 20 రేషన్ షాపులు ఉండగా కేవలం 7 రేషన్ దుకాణాలకు మాత్రమే సన్నబియ్యాన్ని సరఫరా చేశారు. మిగితా 13 రేషన్ దుకణాలకు శుక్రవారం వరకు సన్నబియ్యం అందలేదు. మండల కేంద్రంలోని ఒకటి, రెండవ, మూడవ నంబర్ చౌక ధరల దుకణాల ద్వారా మాత్రమే లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేస్తున్నారు. లక్ష్మణచాందలో 3 చౌకధరల దుకాణం, చామన్‌పెల్లి, రాచాపూర్, బాబాపూర్, బోరిగాంలోని చౌకధరల దుకాణాలకు మాత్రమే ఇప్పటివరకు సన్నబియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. మిగతా 13 చౌకధరల దుకాణాలకు సన్నబియ్యం సరఫరా కాలేదు. సన్నబియ్యం ఇస్తున్నారని ఆశతో వచ్చిన మండలంలోని గ్రామాల లబ్ధిదారులు నోస్టాక్ అని చెప్పడంతో వెనుదిరిగిపోతున్నారు.

## మట్కా నిర్వాహకుడి అరెస్ట్

జైనథ్, ఏప్రిల్ 4: జైనథ్ శివారులో మట్కా నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ పురుషోత్తం, ఏఎస్ఐ సిరాజ్, కానిస్టేబుళ్లు సందీప్, స్వామి కలిసి దాడి చేసి మట్కా నిర్వహిస్తున్న వగారే ప్రమోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.5 వేలు, సెల్ ఫోన్ సీజ్ చేసి ఫోన్‌లోని మట్కా చీటీలను స్వాధీన పర్చుకున్నారు. సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి అట్టి మట్కా డబ్బులను ఏ2 అశోక్ స్మాట్ మహారాష్ట్రకు పంపుతున్నాడు. వారిపై కేసు నమోదు చేశామని సీఐ సాయినాథ్ తెలిపారు.

## వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన



ఎదులాపురం:మాట్లాడుతున్న రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముజాహిద్



బోథ్: నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఎదులాపురం, ఏప్రిల్ 4: ఆదిలాబాద్‌లో బడ్కామొహల్లా శుక్రవారం ప్రార్థనల తర్వాత మసీదు ప్రాంగణంలో ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముజాహిద్ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఈ బిల్లు ద్వారా కేవలం మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి ఇంతేఖాబ్ ఆలం, సర్దార్ ఆలం, యువకులు పాల్గొన్నారు.

బోథ్, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని గుల్జార్ మసీదులో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకిస్తూ శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు తమ వ్యతిరేకిస్తున్నామన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఆమోదించిన సవరణలు వక్ఫ్ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తాయన్నారు. తరతరాలుగా సేవ చేస్తున్న మతపరమైన, దాతృత్వ ప్రయోజనాలకు ముప్పు కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చిన వాహనాలు సీజ్



స్వాధీనం చేసుకున్న మాడిఫైడ్ సైలెన్సర్లను చూపిస్తున్న డీఎస్పీ, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలు

ఎదులాపురం, ఏప్రిల్ 4 : మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చిన వాహనాలు సీజ్ చేశామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి అన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎక్కువ శబ్దం వచ్చే 50 సైలెన్సర్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు బిగించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాంటి వాహనాలను సీజ్ చేయడంతో పాటు పబ్లిక్ న్యూసెన్స్, ఎంవీయాక్ట్, పట్టణ మిషన్స్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం కంపెనీ నుంచి ఉన్నటువంటి సైలెన్సర్ అమర్చిన తర్వాతనే వాహనాన్ని రిలీజ్ చేస్తామని తెలిపారు. ప్రజలు, వాహనదారులు, తల్లిదండ్రులు, యువత వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సౌండ్ పొల్యూషన్ అరికట్టాలని కోరారు. డీఎస్పీ వెంట సీఐ ప్రణయ్‌కుమార్, ఎస్ఐ దేవేందర్ ఉన్నారు.

## ఆటో, ట్రాక్టర్ ఢీ : ఐదుగురికి గాయాలు

బైంసాటౌన్, ఏప్రిల్ 4 : ఆటో, ట్రాక్టర్ ఢీ కొని ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణ శివారులోని హరియాలీ ఫంక్షన్ హాల్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహీంద్ర షోరూంలో ట్రాక్టర్ సర్వీసింగ్ చేశాక టెస్టింగ్ కోసం ఇంజన్‌ను దేగాం వైపు తీసుకెళ్తుండగా దాని వెనుకల ప్రయాణికులతో దేగాం వెళ్తున్న ఆటోను గమనించకుండా యూటర్న్ తీసుకునే ప్రయత్నం చేయగా ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భైంసా మండలం మాలేగాంకు చెందిన శివలింగు, గంగాధర్, భైంసా మండలం ఇలేగాంకు చెందిన ఆకాష్, సాయి, తానూర్ మండలం ఉమ్రికి చెందిన చంద్రకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు క్షతగాత్రులను 108లో ఏరియా దవాఖానకు తరలించారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 4 : ఆదిలాబాద్‌లోని జడ్పీ క్వార్టర్స్ పరిధిలో పేకాటాడుతున్న 9 మందిని పట్టుకున్నామని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పీ చంద్రశేఖర్ తెలిపారు. సీసీఎస్ ఆధ్వర్యంలోని బృందం దాడి చేయగా 9 మంది పేకాటాడుతూ పట్టుపడ్డారు. వారి వద్ద నుంచి రూ 39,600, పేకాట ముక్కలు, 7 బైకులు, 9 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొని ఆదిలాబాద్ వన్‌టౌన్ స్టేషన్‌కు కేసు నిమిత్తం వారిని పంపించినట్లు తెలిపారు. ఈ దాడిలో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవులు మృతి

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 4 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలం బామ్ని గ్రామంలోని రైతు కందారం సాయన్నకు చెందిన ఆవులు అందకూర్ గ్రామం వైపు మేతకు వెళ్లాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తాకి ఆవు మృతి చెందింది.రూ. 50 వేల నష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తులో ఉంచాలని కోరారు.

సారంగాపూర్, ఏప్రిల్ 4: జామ్ గ్రామానికి చెందిన అవదూత్(మంగళి) నరేశ్‌కు ఒక ఆవు, రెండు లేగదూడలు ఉన్నాయి. ప్రతి రోజులాగే శుక్రవారం ఉదయం పశువుల కొట్టం నుంచి ఆవు, లేగదూడలను పశువుల మందలో కలపడానికి తీసుకెళ్తున్నాడు. ఇందిరమ్మ కాలనీ హనుమాన్ మందిరం పక్కన ఉన్న 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న ఎర్త్‌వైర్‌కు తగిలి అక్కడికక్కడే ఆవు మృత్యువాత పడింది. మరో రెండు లేగదూడలు ప్రాణాలతో బయటపడ్డాయి. ఆవు విలువ రూ. 60వేలు ఉంటుంది.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై బహిరంగ విచారణ

బేల, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా బేలలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ, పంచాయతీ అధికారులు శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులపై బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మనోహర్ మాట్లాడుతూ 94 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత అధికారులతో లబ్ధిదారుల సమస్యలు పరిష్కారం చేపడుతున్నామన్నారు. పరిష్కారం కాని దరఖాస్తుల విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఘునాథ్ రావ్, ఎంపీడీవో మహేందర్ కుమార్, ఎంపీవో మహేశ్‌కుమార్, వ్యవసాయ అధికారి సాయితేజ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అదనపు డీఎంహెచ్‌వో మనోహర్ తనిఖీ చేశారు. ప్రసూతి వార్డు, ల్యాబ్‌ను పరిశీలించిన పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ మారుమూల మండల ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఓపీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ భీంరావ్, ఆలేఖ్య, హెచ్‌ఈవో సూర్యప్రకాశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

తాంసి, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా తాంసిలో గురువారం రాత్రి 11 నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు అప్రకటిత విద్యుత్ కోతలు చోటు చేసుకున్నాయి. 12 గంటల పాటు ఎలాంటి సమాచారం లేకుండానే ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి వేళల్లో విద్యుత్ లేకపోవడంతో పెరిగిన ఉష్ణోగ్రతలో పంకాలు, కూలర్లు పని చేయకపోగా చిరు వ్యాపారాలు, హోటళ్లు, కూలింగ్ సెంటర్లు అవస్థలు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ సెంటర్‌లో సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ తరహా కోతలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ అధికారులు సమస్యపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బోథ్ బస్టాండ్‌లో అక్రమ టేలాల తొలగింపు

బోథ్, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లా బోథ్ బస్టాండ్ ప్రహరీపై అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలను శుక్రవారం ఆర్టీసీ అధికారులు పోలీసుల సహకారంతో తొలగించారు. గురువారం రాత్రి కొంత మంది ప్రహరీపైన టేలాలు ఏర్పాటు చేశారు. కంట్రోలర్ సుదర్శన్ విషయాన్ని నిర్మల్ డిపో మేనేజర్‌కు సమాచారం అందించారు. డీఎం పండరి అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, నిర్మల్ స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి బోథ్‌కు చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలను తీసివేయించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ నియమ నిబంధనలు ఎవరు కూడా అతిక్రమించొద్దన్నారు. ప్రహరీ పూర్తయ్యాక వ్యాపారాల కోసం టెండర్లు పిలుస్తామన్నారు. టెండర్ దక్కించుకున్న వారు వ్యాపారాలు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఈ ఆంజనేయులు, ఏఈ అజయ్ పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ కలెక్టర్‌కు సన్మానం

ఎదులాపురం, ఏప్రిల్ 4 : ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు స్కోచ్ పురస్కారం వచ్చినందుకు ఔట్ సోర్సింగ్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను శాలువా, మెమోంటోతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు కలెక్టర్‌కు వివరించారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారానే వేతనాలు చెల్లించాలని, అదే విధంగా మహిళలకు వేతనం కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఔట్ సోర్సింగ్ జేఏసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండ శ్రీను, అగ్గిమల్ల స్వామి, నాయకులు ఉన్నారు.

## పెంబిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

పెంబి, ఏప్రిల్ 4: నిర్మల్ జిల్లా పెంబిలోని కిరాణా దుకాణాలు, వారసంతలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రత అధికారి వసురామ్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిరాణా దుకాణాల నిర్వాహకుల నుంచి ప్రతి మూడు నెలలకు ఒక షాపు యజమాని నుంచి రూ. 2 వేలు చొప్పున మాముల్లు వసూలు చేస్తున్నారని జిల్లా అధికారిపై పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లా అధికారి వసురామ్‌ను వివరణ కోరగా ఆరోపణలు అవాస్తవమని లైసెన్స్ కోసం రూ. 2 వేలు తీసుకున్నామని తెలిపారు. ఫుడ్‌సేఫ్టీ అధికారుల పేరుతో ఇతరులు ఎవరైన డబ్బులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

సారంగాపూర్, ఏప్రిల్ 4: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలని నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మాస్ మీడియా అధికారి రవీందర్, ఆశకార్యకర్తలు ఉన్నారు.

## బహుజన బతుకుల్లో వెలుగు నింపిన మహనీయుడు

దస్తురాబాద్, ఏప్రిల్ 4 : బహుజన బతుకుల్లో వెలుగు నింపిన మహనీయుడు డా.బీఆర్. అంబేద్కర్ అని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని గొడిసేర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాబీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, దళిత సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శైలజరమేశ్, డైరెక్టర్ పుల్యానాయక్, మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కోతులు పట్టివేత



కోతులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న సిబ్బంది

ఖానాపూర్, ఏప్రిల్ 4 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ శుక్రవారం తగిన చర్యలు చేపట్టారు. సంబంధిత సిబ్బందిని పిలిపించి మున్సిపల్ పార్కు వద్ద 100కు పైగా కోతులను పట్టుకొని అడవిలో విడిచిపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో దశ వారిగా కోతులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## ఎస్ఎస్‌సీ విద్యార్థులకు కెరీర్ మార్గదర్శక శిబిరం

బాసర, ఏప్రిల్ 4 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముథోల్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు కెరీర్ మార్గదర్శక శిబిరం నిర్వహించినట్లు ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగమైన ఎస్‌డీజీ-4 నాణ్యమై విద్యపై తమ నిబద్ధతగా, ఆర్జీయూకేటీకు చెందిన టీమ్ ట్రాన్స్‌ఫార్మ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి డా. ఎన్ విజయ్‌కుమార్, శిక్షణ ప్రోగ్రామ్ అధికారిగా లకుమాదేవి నాయకత్వం వహించినట్లు పేర్కొన్నారు.

## రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

భైంసా, ఏప్రిల్ 4 : అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు ఎప్పటికప్పుడు పకడ్బందీగా నిర్వహించాలని సీడీపీవో రాజశ్రీ అన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలోని గణేశ్ నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె స్త్రీ శిశు సంక్షేమ శాఖ యాప్‌ల వినియోగం, పొందుపరచాల్సిన సమాచారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భైంసా, కుభీర్, కుంటాల మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

భైంసా, ఏప్రిల్ 4 : భైంసా పరిధిలో కొత్త ఆర్థిక సంవత్సరం 2025-26 మొదటి నెలలోనే ఆస్తిపన్ను మొత్తం చెల్లించే వారికి 5 శాతం రాయితీ వర్తించే ఎర్లీబర్డ్ పథకం ఈ నెల 30వ తేదీ వరకు ఉందని మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సర మొత్తం ఆస్తిపన్ను ఒకే దఫా చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఇంటింటి ఎల్‌సీడీసీ సర్వే

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 4 : నిర్మల్‌లోని బంగల్‌పేట్, వైఎస్సార్‌కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది ఇంటింటా ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించారు. కుష్ఠు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ పీఎంవో రాజేశ్వర్, హెచ్ఎస్ రాములు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వరి పంట పక్వానికి వచ్చిన తర్వాతనే కోయాలి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 4: యాసంగి వరి పంట పక్వానికి వచ్చిన తర్వాతనే కోత కోయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ తహసీల్ కార్యాలయంలో వివిధ గ్రామాల్లో ఉన్న హార్వెస్టర్ ఓనర్స్, డ్రైవర్స్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోత సమయంలో హార్వెస్టర్ యాజమానులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్ధార్ అజీజ్ హమ్మద్‌ఖాన్, ఏఈవోలు, వివిధ గ్రామాలకు చెందిన హార్వెస్టర్ ఓనర్లు పాల్గొన్నారు.